ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 383 వినతులు

విశాలాంధ్ర-విశాఖ కలెక్టరేట్ : కలెక్టరేట్లో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)కు వివిధ సమస్యలపై ప్రజల నుంచి 383 వినతులు అందాయి. వాటిలో రెవెన్యూ శాఖకు చెందినవి 115 ఉండగా, పోలీసు శాఖకు సంబంధించి 28, జీవీఎంసీకు సంబంధించి 94 ఉన్నాయి. అలాగే ఇతర విభాగాలకు సంబంధించి 146 వినతులు వచ్చాయి. జిల్లా రెవెన్యూ అధికారి భవానీ శంకర్, డిప్యూటీ కలెక్టర్లు శేషశైలజ, మధుసూధన్ రావు, చీఫ్ సిటీ ప్లానింగ్ ఆఫీసర్ ప్రభాకర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం, మండల కార్యాలయాలలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో అర్జీదారులు 1100 కాల్ సెంటర్కు ఫోన్ చేసి తమ ఫిర్యాదుల స్థితిని తెలుసుకోవచ్చని, అదేవిధంగా ఏమైనా సందేహాలు ఉంటే అడగవచ్చని, కొత్త ఫిర్యాదులు కూడా నమోదు చేయవచ్చని డీఆర్వో తెలిపారు. పీజీఆర్ఎస్ లో వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

సమాచార శాఖ రెగ్యులర్ డీడీగా సదారావు బాధ్యతల స్వీకరణ

విశాలాంధ్ర-విశాఖ కలెక్టరేట్ : సమాచార పౌర సంబంధాల శాఖ, విశాఖపట్టణం రెగ్యులర్ డీడీగా కె. సదారావు బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఇప్పటి వరకు నెల్లూరు డీడీగా సేవలందించారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా విశాఖపట్టణం ఉప సంచాలకులుగా నియమితులయ్యారు. ఈ మేరకు ఇప్పటి వరకు ఇన్చార్జి డీడీగా వ్యవహరించిన డి. రమేశ్ నుంచి సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. సంబంధిత పత్రాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా సమాచార పౌర సంబంధాల శాఖ, ప్రాంతీయ సంయుక్త సంచాలకులు వి. మణిరామ్ ను మురళీనగర్ లోని తన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి వచ్చారు. సదారావు నియామకం పట్ల సమాచార శాఖ ఉద్యోగులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఇప్పటి వరకు ఈ స్థానంలో ఇన్చార్జి డీడీగా వ్యవహరించిన డి. రమేశ్.. ఎస్.ఐ.సి. ఏడీగా తన పూర్వ విధులకు వెళ్లిపోయారు.

మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర-పెందుర్తి : పెందుర్తి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం ఉదయం మండల అధ్యక్షురాలు మదుపాడ నాగమణి అధ్యక్షతన ఎంపీడీవో వెంకట్రావు ఆధ్వర్యంలో జరిగింది. ఎంపీటీసీలు సర్పంచులు మండలానికి సంబంధించిన వివిధ శాఖల అధికారులు పాల్గొన్న ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. ముఖ్యంగా వర్షా కాలంలో రైతులకు విత్తనాలు పంపిణీ, విద్యార్థులకు పుస్తకాలు అందజేయడం అలాగే రోడ్లు, కాలువల నిర్మాణ సహా పలు అభివృద్ధి పనులకు సంబంధించిన అంశాలను చర్చించారు. గత సమావేశంలో ఆమోదించిన అంశాల పురోగతిపై సమీక్షించారు.

బిజెపి ఆధ్వర్యంలో శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి వేడుకలు

విశాలాంధ్ర-ఆనందపురం : మండలంలో పెద్దిపాలెం గ్రామంలో సోమవారం ఉదయం శ్యాం ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్‌ని పురస్కరించుకుని బిజేపి రాష్ట్రకౌన్సిల్ మెంబర్ ఉప్పాడ అప్పారావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విశాఖ జిల్లా కిసాన్ మోర్చ అధ్యక్షులు పి.వి.వి.ప్రసాదరావు పట్నాయక్ పాల్గొని మాట్లాడుతూ జాతీయ వాదానికి జాతీయ సమైక్యతకు మారుపేరు భారతీయ జన సంఘ్ వ్యవస్థాపకులు డా.శ్యాంప్రసాద్ ముఖర్జీకి వర్ధంతి సందర్భంగా శిరస్సు వంచి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు మీసాల రాము నాయుడు పోతిన జీవన్ సంతోష్, బోర శ్రీను, మల్లారపు కృష్ణ, నిమ్మకాయల అప్పల రాజు ఉప్పాడ శివ,మల్లారపు మోహన్, పిల్లా చిన్నారావు, బాలి త్రినాథ్, బిజెపి బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణతోనే లక్ష్యసాధన

విశాలాంధ్ర-పెదగంట్యాడ : ఎస్సీ వర్గీకరణతోనే లక్ష్య సాధన సుగమం అయ్యిందని ఎం.ఆర్ పీ ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పేరేల్లి ఎలీషా మాదిగ అన్నారు. పెదగంట్యాడలో సోమవారం ఎం.ఆర్. పీఎస్ ప్రతినిధులు ఎలీషాకు ఆత్మీయ సత్కారం చేసారు. ఎలీషా మాట్లాడుతూ ఎం.ఆర్. పీ ఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణ 30 ఏళ్ల పోరాటం సుప్రీం కోర్టు తీర్పుతో సాధ్యమయ్యిందని అన్నారు. మాదిగ రిజర్వేషన్ పోరాట ఫలితంగా ఎస్సీ వర్గీకరణ సాధ్య పడిందని అన్నారు. మాదిగలు తమ హక్కుల కోసం ఉద్యమించాలని అన్నారు. పెద పూడి దుర్గారావు అధ్యక్షతన జరిగిన ఈ సత్కార కార్యక్రమంలో ఎలీషాను శాలువా, పూల మాలలతో సత్కరించారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఎం.ఆర్ పి.ఎస్ నాయకులు పెట్ల రమణ, కడితి సాధురావు, కింతాడ రాజశేఖర్, కాకినాడ పెంటరావు, అనపర్తి వెంకట రమణ, ములకల పల్లి చిన్నారావు, వి.విఆర్‌కుమార్ పాల్గొన్నారు.

బర్ధన్‌నగర్ కాలనీకి మౌలిక సదుపాయాలు కల్పించాలి

మేయర్‌కి సిపిఐ నాయకుల వినతి

విశాలాంధ్ర-విశాఖ : పెందుర్తి మండలం చినముషిడివాడ రెవిన్యూ విలేజీ పరిధిలోని బర్ధన్‌నగర్ కాలనీకి మౌలిక సదుపాయాలు కల్పించాలని మేయర్ పీలా శ్రీనివాస్‌ని సీపీఐ నాయకులు కోరారు. ఈ మేరకు ఆయనకి సోమవారం సిపిఐ జిల్లా కార్యదర్శి షేక్ రెహమాన్, కార్యవర్గ సభ్యులు ఆర్. శ్రీనివాస్, వై.త్రినాధ్, ఎన్. నాగభూషణం, పి. చంద్రశేఖర్, వనజాక్షి, కె. సత్యనారాయణ వినతిపత్రం అందజేశారు. కాలనీలో సుమారు వంద కుటుంబాలు నివసిస్తున్నాయని తెలిపారు. జీవీఎంసీ ఈ కాలనీలో మూడు బోర్లను ఏర్పాటు చేసిందని తెలిపారు. ఇళ్లకు విద్యుత్ కనెక్షన్ లేదని వివరించారు. ఏపీ ఈపీడీసీఎల్ అధికారులు ఎన్నిసార్లు వినతి పత్రాలు సమర్పించినా స్పందించడం లేదన్నారు. సిజీఆర్ఎఫ్ కి ఫిర్యాదు చేయగా విద్యుత్ సౌకర్యం కల్పించాలని ఆదేశాలు ఇచ్చారని, అయినా అధికారులు వివిధ రకాల సాకులతో విద్యుత్ సౌకర్యం కల్పించడం లేదని అన్నారు. దీని వల్ల విద్యార్థులు చదువుకోవడానికి ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. పరిసరాల్లో తుప్పలు పెరిగి పాములు, విష కీటకాల బెడద పెరిగిందని అన్నారు. ఈ కాలనీకి విద్యుత్ సౌకర్యం సమకూర్చాలని కోరారు.

కేంబ్రిడ్జ్ చెక్ పాయింట్ 2025 ఫలితాల్లో ఒక్రిడ్జ్ వైజాగ్ విద్యార్థుల మెరుపు ప్రదర్శన

విశాలాంధ్ర-తగరపువలస : ఒక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ విశాఖపట్టణం తమ ప్రైమరీ మరియు లోయర్ సెకండరీ విద్యార్థులు కేంబ్రిడ్జ్ చెక్‌పాయింట్ 2025 అధ్యయనాల్లో సాధించిన అభినందనీయ విజయాలను గర్వంగా ప్రకటించింది. ఈసంవత్సరం, ఒక్రిడ్జ్ విద్యార్థులు అత్యుత్తమ ప్రదర్శన చూపించి, పాఠశాల యొక్క అకాడమిక్ ప్రాముఖ్యతను, సమగ్ర అభివృద్ధిపట్ల ఉన్న అంకితభావాన్ని ప్రతిబింబించారని స్కూల్ యాజమాన్యం తెలిపింది. కేంబ్రిడ్జ్ లోయర్ సెకండరీ చెక్‌పాయింట్ అధ్యయనాలలో, ఒక్రిడ్జ్ విద్యార్థులు గణితం మరియు సైన్స్ రంగాలలో అంతర్జాతీయ సగటును మించిపోయారు. ఇది విద్యార్థుల ప్రతిభను మరియు ఒక్రిడ్జ్ బోధనా విధానంలోని మన్నికను స్పష్టంగా చాటిచెప్పుతోంది. ఈ ఫలితాలలో విశేషంగా విద్యార్థులు ఇంగ్లీష్, మ్యాథ్స్, సైన్స్ అన్నీ విషయాల్లో పూర్తి మార్కులు 50/50 సాధించి అంతర్జాతీయ స్థాయిలో అగ్రశ్రేణిలో నిలిచారు. షైలి గంటా 48/50 మార్కులతో మరొక అత్యుత్తమ ప్రదర్శన చూపించారు. కేంబ్రిడ్జ్ ప్రైమరీ చెక్‌పాయింట్‌లో కూడా ఒక్రిడ్జ్ విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించారు. కల్యాణి ఝా సైన్స్‌లో పూర్తి మార్కులు 50/50 సాధించగా, రియా మహాలక్ష్మి పినపతుర్ని గారు 40/50 మార్కులతో ప్రతిభ కనబరిచారు. ఈఫలితాలు మన విద్యార్థుల కృషి, పట్టుదల మరియు విజ్ఞానసాధనకు ప్రతిబింబం. ప్రతి రోజు వారిలో ఉత్తమతనాన్ని మెరుగు పరుస్తూ, విద్యార్థులను ప్రోత్సహిస్తున్న మా ఉపాధ్యాయుల పట్ల మేము ఎంతో గర్విస్తున్నామని తెలియజేసారు. ఒక్రిడ్జ్‌లో మేము భవిష్యత్‌కు సిద్ధమైన గ్లోబల్ సిటిజన్లను తయారుచేయడంలో విశ్వసిస్తున్నాము. ఈ విజయాలు మా లక్ష్యానికి మద్దతు ఇస్తున్నాయి, అని పాఠశాల ప్రిన్సిపాల్ శైల బామిడిపాటి పేర్కొన్నారు.

జాతీయ సమ్మెను విజయవంతం చేయండి : ఏ.ఐ.ఎస్.డబ్ల్యూ.ఎఫ్



విశాలాంధ్ర-పెదగంట్యాడ : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా జూలై 9న జరిగే జాతీయ సమ్మెలో కార్మికవర్గం పాల్గొని విజయవంతం చేయాలని ఆలిండియా స్టీల్ వర్కర్స్ ఫెడరేషన్ (ఏ. ఐ.ఎస్ డబ్ల్యు ఎఫ్) పిలుపునిచ్చింది. బొక్షారో స్టీల్ సిటీలో ఫెడరేషన్ సమితి సమావేశం జరిగింది. ఈసమావేశం ఫెడరేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామేంద్ర కుమార్, డి.ఆదినారాయణ మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ పరిశ్రమ లను ప్రైవేటీకరిస్తూ, కార్మిక వర్గ హక్కులను హరించి వేస్తున్నదని విమర్శించారు. దేశంలో అనేక పరిశ్రమలను ఇప్పటికే నిర్వీర్యం చేసిందని అన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని నూటికి నూరు శాతం అమ్మా లనే కేంద్రం కుట్రలు పన్నుతున్న దని అన్నారు. ఉక్కులో వేతన సవరణ జరగక కార్మిక వర్గం ఇక్కట్లకు గురి అవుతున్న దని అన్నారు. స్టీల్ ప్లాంట్ కు ఐ రన్ ఒర్ గనులు కేటాయించాలని డిమాండ్ చేసారు. జూలై 9 న జరిగే జాతీయ సమ్మె లో కార్మిక వర్గం పాల్గొని విజయ వంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో విశాఖ ఉక్కు నుంచి నాయకులు కె.ఎస్ ఎన్ రావు, జె.రామకృష్ణ, ఎస్.మోహన్‌బాబు, డొక్కా నర్సింగరావు పాల్గొన్నారు.

చందక సర్వే నెం.4లో అక్రమ అక్రమ గ్రావెల్ దందా

అనుమతి ఒకటి... పనిచేసేది ఒకటి

కొండను మాయం చేస్తున్న మట్టి బకాసురులు

రాత్రికిరాత్రే కొండను కాళీ చేస్తున్న వైనం

విశాలాంధ్ర-ఆనందపురం : మండలం చందక పంచాయతీ కొండ పోరంబోకు సర్వేనెంబర్ 4లో, అక్రమ గ్రావెల్ దందా జరుగుతుంది. ప్రభుత్వ కాలనీలకు పేరు చెప్పుకొని కొందరు గ్రావెల్ దందాకు పాల్పదుతున్నారు. ఇష్టానుసారంగా కొండలను తవ్వేసి మట్టిని మాయం చేస్తూ కాసులు జోబులో వేసు కుంటున్నారు. అనుమతులు ఉన్నాయని కాంట్రాక్టర్ చెబుతూ అనుమతుల్లో ఉన్నవి ఒక వాహనాలు అయితే గ్రావెల్‌తో వెళ్లేవి మరొక వాహనాలు పొంతనలేని సమాధానాలు చెబుతూ కొండన మట్టిని తవ్వేస్తున్నారు, ఇదే అదునుగా చూసుకొని కొంతమంది ప్రైవేట్ లేఔట్ యజమానులు అడ్డగోలుగా మట్టిని మింగేస్తున్నారు. లేఔట్‌లో రోడ్లకు ఈ మట్టిని వినియోగించుకుంటూ వారి పనిని సజావుగా కానిస్తున్నారు. రాత్రింబవళ్లు తేడా లేకుండా సుమారు 2 వేల లారీలు వరకు మట్టి బయటికి పోయి ఉంటుందని, కొండ చుట్టుప్రక్కల పెద్దపెద్ద గోతుల వలె మారిందని, స్థానికులు చెబుతున్నారు. ఫిర్యాదు మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న ఆనందపురం పోలీసులు జెసిబి లారీలు ,ట్రాక్టర్లు, స్వాధీనం చేసుకుని పరిశీలన చేసి సమగ్ర నివేదిక రెవెన్యూ అధికారులకి పంపుతామని తెలిపారు.

జివిఎంసి "ప్రజా సమస్యల పరిష్కార వేదిక"లో 77 వినతులు

- నగర మేయర్ పీలా శ్రీనివాసరావు

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "ప్రజా సమస్యల పరిష్కార వేదిక"కు 77 వినతులు వచ్చాయని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. సోమవారం ఆయన జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని పాత సమావేశ మందిరంలో అదనపు కమీషనరు డి.వి. రమణమూర్తితో కలసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమానికి జివిఎంసికి సంబంధించి 77 అర్జీలు/ఫిర్యాదులు స్వీకరించడం జరిగిందని తెలిపారు. అందులో ముఖ్యంగా 2వ జోన్‌కు 15, 3వ జోన్ కు 14, 4వ జోన్ కు 11, 5వ జోన్‌కు 06, 6వ జోనుకు 10, 8వ జోన్ కు 12, జివిఎంసి ప్రధాన కార్యాలయానికి 09 ఫిర్యాదులు అందాయని తెలిపారు. అలాగే జివిఎంసి అడ్మినిస్ట్రేషన్ & అకౌంట్సు విభాగమునకు 04, రెవెన్యూ విభాగమునకు 06, ప్రజారోగ్య విభాగమునకు 04, పట్టణ ప్రణాళిక విభాగమునకు 49, ఇంజినీరింగు విభాగమునకు 10, మొక్కల విభాగమునకు 01, యుసిడి విభాగమునకు 03 కలిపి మొత్తంగా 77 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. ఈఫిర్యాదులకు సంబంధించిన విభాగాధిపతులు ప్రజలు పెట్టుకున్న అర్జీలను/ఫిర్యాదులను ప్రతి రోజు పరిశీలిస్తూ, నిర్దీత సమయంలో పరిష్కరించాలని, వచ్చిన అర్జీలపై అధికారులు వెంటనే స్పందించి కార్యాచరణ చేపట్టాలని, ప్రతివారం అదే ఫిర్యాదులు తిరిగి ప్రజలు సమర్పించకుండా ఆయా సమస్యలను నిర్దీత సమయం లో పరిష్కరించాలని జివిఎంసి అధికారులను అదనపు కమిషనర్ డి.వి.రమణమూర్తి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఇ.ఎన్.వి నరేష్ కుమార్, చీఫ్ సిటీ ప్లానర్ ఎ.ప్రభాకర్ రావు, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ సి. వాసుదేవ రెడ్డి, ఫైనాన్సర్ అడ్వైజర్ మల్లికాంబ, డీసీఆర్ ఎస్. శ్రీనివాసరావు, పర్యవేక్షక ఇంజనీర్లు గోవిందరావు, పి.వి.వి. సత్యనారాయణ రాజు, కె.వి.ఎన్ రవి, సంపత్ కుమార్, కె .శ్రీనివాసరావు, కృష్ణారావు, డి డి హెచ్ ఎం. దామోదర రావు, యు సిడి-ప్రాజెక్ట్ ఆఫీసర్ డి.లక్ష్మి, డిపిఓ ఎల్.సురేష్, సివిఓ డాక్టర్ ఎన్. కిషోర్, డీసీపీ హరిదాస్, ఏసీపీలు తిరుపతిరావు, రామలింగేశ్వర రెడ్డి, వెంకటేశ్వరరావు, స్పోర్ట్స్ డైరెక్టర్ అప్పలరాజు, బయాలజిస్ట్ సాంబమూర్తి, ఆర్ఎఫ్ఓ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ భూములను బడా కంపెనీలకు కట్టబెడుతున్న రాష్ట్ర ప్రభుత్వం

స్థల యజమానులకి నష్టపరిహారం చెల్లించాలి

విశాలాంధ్ర-విశాఖపట్నం : విశాఖపట్నం నగరంలోని ఎంతో విలువైన ప్రైవేట్ స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వం బడా కంపెనీలకు కట్టబెడుతుందని సుప్రీంకోర్టు న్యాయవాది వాడపల్లి శివానంద ఆరోపించారు. ఈ మేరకు నగరంలోని ఓ హోటల్లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాండురంగాపురం లోని హార్బర్ పార్క్‌కి ఎదురుగా గలకు 13.08 ఎకరాల భూమిని ప్రభుత్వం అనధికారికంగా లులు అనే సంస్థకు 99 ఏళ్లకు లీజుకు ఇవ్వడం చట్టబద్ధం కాదని ఇది పూర్తిగా ప్రైవేటు మరియు జిరాయితీ భూమిని దీనిపై కోర్టులో పలు పిటిషన్ల విచారణ జరుగుతుందని అన్నారు. బీచ్ రోడ్‌లోని మాజీ ఎంపీ సుబ్బిరామిరెడ్డి గెస్ట్ హౌస్ పక్కన ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా లులు సంస్థకు కేటాయించినట్లు ప్రకటించిందని కానీ ఆ స్థలానికి సంబంధించి పదిమంది యజమానులు, వారి వారసులు ఉన్నారని అన్నారు. వారిని సంప్రదించకుండా వారికి ఎటువంటి నష్ట పరిహారం చెల్లించకుండా ప్రభుత్వం ఏకపక్షంగా ప్రైవేటు సంస్థకు కేటాయించడం పై బాధితులు హైకోర్టులో న్యాయ పోరాటం చేస్తున్నారన్నారు. దీనిపై ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో నాలుగు రిట్ పిటిషన్‌లు సుప్రీంకోర్టులో ఒక స్పెషల్ లీవ్ పిటిషన్ వేయడం జరిగిందని దీనిపై ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయాల్సి ఉందని చెప్పారు. అప్పటివరకు ఈస్థలానికి సంబంధించి ఎటువంటి నిర్మాణాలు చేపట్టడం కానీ ఎటువంటి ఇతర ఆర్థిక లావాదేవీలు జరపరాదని ఆయన సూచించారు. అలా ఎవరైనా జరిపితే చట్టరీత్యా చర్యలు తీసుకోబడుతుందని ఆయన తెలిపారు. అంతేకాకుండా ప్రభుత్వ పెద్దల నుండి ఇప్పటికే తమకు బాధితులకు ప్రభుత్వ పెద్దల నుండి బెదిరింపులు వస్తున్నాయని తమకు ప్రాణహాని కూడా ఉందని న్యాయవాదులు తెలిపారు. ప్రభుత్వం బాధితులకి నష్ట పరిహారం చెల్లించి ఆస్థలాన్ని తీసుకోవాలనుకుంటే ప్రభుత్వానికి ఇచ్చేందుకు స్థల యజమాను సిద్ధంగా ఉన్నారని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో సుప్రీంకోర్టు అండ్ హైకోర్టు అడ్వకేట్‌లు ఏపీ హైకోర్టు & సుప్రీంకోర్టు న్యాయవాది వాడపల్లి శివానంద, జనపామల వెంకట కొండలరాయుడు, హైకోర్టు అడ్వకేట్ యెన్ని కృష్ణ, అడ్వకేట్ ఎల్లా పంతులు, గున్నా కామేశ్వరరావు తోపాటు పలువురు పాల్గొన్నారు.

వీధి వ్యాపారుల సమస్యలపై కలెక్టర్ స్పందించాలి

ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తెడ్డు వెంకటేశ్వరరావు డిమాండ్

విశాలాంధ్ర-విశాఖ సిటీ : విశాఖ నగరంలో వీధి విక్రయదారులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆంధ్రప్రదేశ్ వీధి విక్రయదారుల కార్మిక ఫెడరేషన్ (ఏఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తెడ్డు వెంకటేశ్వరరావు నాయకత్వంలో సోమవారం జీవీఎంసీ గాంధీ దగ్గర వద్ద ఆందోళన చేపట్టారు. 2013 నుండి 2024 వరకు గుర్తింపు కార్డులు, వెండింగ్ సర్టిఫికెట్ కోసం చెల్లించిన సొమ్ములో అవినీతి జరిగిందని ,దీని మీద వెంటనే సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఫుడ్ కోర్ట్‌లో ఆర్థిక అవినీతి జరిగిందని , పూర్తిస్థాయి విచారణ జరపాలని డిమాండ్ చేశారు. టౌన్ వెండింగ్ కమిటీలో ఓట్ బ్యాలెట్ ఎన్నికలు జరిగే వరకు నిలిపివేయాలన్నారు. నేడు జరుగుతున్న హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం జీ.వీ.ఎం.సీ పరిధిలో ఎనిమిది జోనల్లో గుర్తింపు కార్డులు, వెండింగ్ సర్టిఫికెట్ కోసం జరుగుతున్న సర్వే వీధివిక్రయదారుల సంఘాలతో అనుసంధానం చేయాలన్నారు. 2013-2025 వరకు ఐడి కార్డు నిమిత్తం వసూలు చేసిన ఆర్థిక లావాదేవీలలో జరిగిన అవినీతి అక్రమాలపై, 2018-2024వ సంవత్సరంలో ఫుడ్ కోర్ట్ నియామకాల్లో జరిగిన అవినీతి అక్రమాలపై సిబిసిఐడి, ఏసిబి, విజిలెన్స్ డిపార్ట్మెంట్లతో దర్యాప్తు జరిపించాలని, నిందితులపై కఠిన చర్యలు తీసుకొని శిక్షించాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాలను అనుసరించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేసిన జీవో ఎంఎస్ నెంబర్ 137 ప్రకారం యూనియన్ సంఘాలతో జాయింట్ సమావేశం ఏర్పాటు చేయించి (ఏ)4/2 రూల్స్ ప్రకారం.బ్యాలెట్ ఎన్నికలు నిర్వహించాలని విజ్ఞప్తి చేస్తూ, అలాగే 2013 నుంచి 2018 జోనల్ టౌన్ వెండింగ్ కమిటీ వరకు ఒక పద్ధతిలో ఎనిమిది జోనుల సిటీ టీవీసి కమిటీగా2018 మరో పద్ధతులు ఐడీ కార్డు సిటీ స్థాయిలో కట్టించుకున్న రుసుము ఆర్థిక లావాదేవీలు పై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ వీధివిక్రయదర్ల కార్మిక ఫెడరేషన్ జిల్లా కో కన్వీనర్ భీంపల్లి రాము, ఏఐటియూసి జిల్లా కౌన్సిల్ సభ్యులు కే సత్యనారాయణ , వీధి విక్రయిదారుల కార్మిక ఫెడరేషన్ జిల్లా కార్యవర్గం కౌన్సిల్ సభ్యులు నాయకుల శ్రీను, కె.ప్రియా, గ్రంధి శ్రీనివాసరావు, నందిని శ్రీను జక్కన్, నరసింహమూర్తి, సుంకర నాగేశ్వరావు, పి చిరంజీవి రావు, దొడ్డి దివాకర్, పి.ఈశ్వరమ్మ, సుంకర బాబ్జి వీధివిక్రయదారులు పాల్గొన్నారు.

ఎస్.ఎం.సి తీర్మానం లేకుండా పాఠశాలలు విలీనం

ఇసుకలపాలెం గ్రామస్తులు ఆవేదన

విశాలాంధ్ర-పద్మనాభం : పద్మనాభం మండలం ఇసుకల పాలెం గ్రామస్తులు ఎస్. ఎమ్. సి తీర్మానం లేకుండా పాఠశాలలు విలీనం చేయడంపై సోమవారం విశాఖపట్నం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్యామల కు ఫిర్యాదు చేయడం జరిగినది. వివరాలు ఇలా ఉన్నాయి. పద్మనాభం మండలం, పద్మనాభం పంచాయితీ పరిధి ఇసకలపాలెం గ్రామ పాఠశాల విద్యాకమిటి చైర్మన్ మరియు సభ్యులు ఫిర్యాదులో తెలిపిన వివరాల మేరకు, పద్మనాభం పంచాయితీ పరిధిలో ఉన్న ఇసకలపాలెం గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సుమారు 50 సంవత్సరము క్రితం నుండి నిర్వహిస్తున్నారు. సదరు పాఠశాలలో 1 వ తరగతి నుండి 5 వ తరగతి వరకు ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే రూపొందించిన నిబంధనల ప్రకారం మా పాఠశాలలోని 3,4,5, తరగతులను పద్మనాభం మండల పరిషత్ పాఠశాలలో విలీనం చేయడానికి అధికారులు ఎస్.ఎమ్.సి తీర్మాణం లేకుండానే నిర్ణయించారు. ఎస్.ఎమ్.సి తీర్మాణంలో 15 మంది కమిటీ సభ్యులు కలిపి నో అని చెప్పడం జరిగింది. మా గ్రామం నుండి 3,4,5, తరగతుల విద్యార్థులు పద్మనాభం మండల పరిషత్ పాఠశాలకు రావాలంటే సుమారు కిలోమీటరు దూరము నడిచి రావటంతో పాటు పద్మనాభం లో ఉన్న రాష్ట్ర రహదారిని దాటి వెళ్లవలసిఉంది. ఈ రహదారి మీదుగా నిత్యం అనేక భారీ వాహనాలు క్వారీ లారీలు, ఇసుక లారీలు, ఇటుక లారీలు బస్సులు, ఆటోలు, ట్రాక్టర్లు, ద్విచక్రవాహనాలు నిరంతరం తిరుగుతూ ఉంటాయి. ఈ కారణంగా చిన్నారులైన విద్యార్థులు ప్రమాదాల బారిన పడే అవకాశం చాలా ఎక్కువగా ఉంది. కిలో మీటరు దూరం బ్యాగులు బరువుతో రావడానికి కూడా చాలా ఇబ్బందులు పడతారు కావున శ్రీ వారు మా యందు దయవుంచి మా ఇసకలపాలెం మండల ప్రాథమిక పాఠశాల 3,4,5, తరగతులను పద్మనాభం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విలీనం చేయకుండా ఆపాలని మా పాఠశాలలో 1 నుండి 5 వ తరగతి వరకు తరగతులు కొనసాగించి మా విద్యార్థుల సమస్యను తీర్చాలని ఫిర్యాదులు పేర్కొనడం

వైయస్ జగన్‌కు భద్రత కల్పించడంలో వైఫల్యం

- కనీసం పోలీస్ ఎస్కార్ట్, రోప్ పార్టీలను కూడా ఇవ్వడం లేదు
- ప్రమాదవశాత్తు జరిగిన ఘటనను జగన్‌కు ఆపాదిస్తున్నారు
- మండిపడ్డ శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స

విశాలాంధ్ర-విశాఖ సిటీ : మాజీ సీఎం వైయస్ జగన్మోహన్ రెడ్డికి నిబంధనల మేరకు భద్రతను కల్పించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ మండిపడ్డారు. సోమవారం తన క్యాంప్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ సత్తెనపల్లిలో జరిగిన ప్రమాదంను దురుద్దేశంతోనే వైయస్ జగన్‌కు ఆపాదించేందుకు ఈ ప్రభుత్వం తెగబడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ కాన్వాయికి ముందు పోలీస్ ఎస్కార్ట్, రోప్ పార్టీని ఏర్పాటు చేయలేదని అంగీకరిస్తారా? భద్రత విషయంలో పూర్తి నిర్లక్ష్యంతో వ్యవహరించామని ఒప్పుకుంటారా అని ప్రశ్నించారు. ఈ పర్యటన అయిన మూడు రోజుల తరువాత ఎల్లో మీడియా ఈటీవీ, ఏబీఎన్, టీవీ5లో ఒక విచిత్రమైన ప్రచారం ప్రారంభించారని విమర్శించారు. ఈ ప్రచారం చూస్తూంటే ఈ రాష్ట్రంలో రాజకీయాలు ఎంతగా దిగజారిపోయాయో అర్థమవుతోందన్నారు. అక్కడ జరిగిన దురదృష్టకరమైన సంఘటనను జగన్ కు ఆపాదించడం దారుణం అన్నారు.

జిల్లా ఎస్పీపై ఎవరు ఒత్తిడి చేశారు..? మాజీ సీఎం వైయస జగన్ కాన్వాయితో సంబంధం లేకుండా ముందుగా వెడుతున్న ఒక ప్రైవేటు వాహనం ఢీ కొట్టడం వల్లే సింగయ్య మరణించాడని ముందుగా సాక్షాత్తు జిల్లా ఎస్పీ ప్రకటించడం జరిగిందన్నారు. మూడు రోజుల తరువాత ఎస్పీ మాటలు ఎందుకు మారాయి? ఎవరి ఒత్తిడితో ఆయన మాటలు మార్చారని ప్రశ్నించారు. ఆ దుర్ఘటన జరిగినప్పుడు బాధ్యతతో వైయస్‌ఆర్‌సీపీ నేతలు ఆయనను తమ వాహనంలో ఆసుపత్రికి తరలించేందుకు ముందుకు వచ్చినా, ఆ సమయంలో అక్కడే వున్న ఎస్ఐ రాజశేఖర్ వారిని వారించారు. 108 వాహనంలోనే సింగయ్యను ఆసుపత్రికి తరలిస్తామని చెప్పి, అంబులెన్స్‌లో ఆసుపత్రికి పంపారు. తరువాత ఆయన మృతి చెందడంతో అందుకు కారణమంటూ సదరు ప్రైవేటు వాహనం డ్రైవర్, యజమానులను పిలిచి వారిపై కేసు నమోదు చేయడంతో పాటు స్టేషన్ బెయిల్ ఇచ్చి వారిని పంపించారు. మూడు రోజుల తరువాత జిల్లా ఎస్పీ మాట మారుస్తూ వైయస్ జగన్‌కు ఈ ఘటనను ఆపాదిస్తూ మాట్లాడటాన్ని ఎలా అర్థం చేసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తనకు తెలిసిన గజకర్ణ గోకర్ణ విద్యలతో చట్టాలను చేతుల్లోకి తీసుకుని, వ్యవస్థలను భ్రష్టుపట్టించి రెండు రోజులుగా మంత్రులతో విషపు ప్రచారం చేయిస్తున్నారని మండిపడ్డారు. దీనివెనుక దురుద్దేశాలు ఉన్నాయని, వైయస్ జగన్ ను బయటకే రానివ్వకుండా చూడాలనే కుట్రల్లో భాగంగానే ఈ తప్పుడు కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. మా హయాంలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లకు పూర్తి భద్రత కల్పించామన్నారు. మాజీ సీఎంకు భద్రత ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వానికి లేదా అని ప్రశ్నించారు.

యువతకు న్యాయం జరిగే వరకు పోరాడతాం : యువతకు కూటమి ప్రభుత్వం చేసిన మోసాన్ని ప్రశ్నిస్తూ "యువత పోరు" పేరుతో ఈరోజు రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహించామన్నారు. యువకులు ఈ ప్రభుత్వంపై తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. సూపర్ సిక్స్ అమలు చేసేశామంటూ ఇటీవలే ముఖ్యమంత్రి అతి పెద్ద అబద్ధం చెప్పి, దానిపై మాట్లాడితే సహించనంటూ బెదిరిస్తున్నారన్నారు. ప్రతిదానిని ఒక ఈవెంట్‌గా మార్చి, పబ్లిసిటీ చేసుకోవడమే చంద్రబాబుకు తెలిసిన పాలనని ఎద్దేవా చేశారు. యువత పోరు సందర్భంగా పల్నాడులో యువకులపై దుర్మార్గంగా లాఠీచార్జీ చేశారు. కేవలం హామీలను అమలు చేయాలని, ఉద్యోగాలు కల్పించాలని కోరడమే వారు చేసిన నేరమా? అని ప్రశ్నించారు. చంద్రబాబు నిరంకుశంగా పాలన చేస్తు ప్రతిపక్షంను భూస్థాపితం చేస్తామన్నారన్నారు. హామీలపై ప్రశ్నిస్తే, మీరెవరూ అడగడానికి అంటూ బెదిరింపులకు దిగారు. ప్రజల తరుఫున గొంతెత్తకపోతే ప్రజలకు అమ్మ ఒడి ఇచ్చేవారా? ఈ ప్రభుత్వ మెడలు వంచి తల్లులకు ఈ సొమ్ము ఇప్పించామని చెప్పారు. సమావేశంలో మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్, జిల్లా పార్టీ అధ్యక్షుడు కెకె రాజు, మాజీ శాసన సభ్యులు తైనాల విజయ్ కుమార్ పాల్గొన్నారు.

ప్రహ్లాదపురంలో డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ బలిదాన దివస్

విశాలాంధ్ర-పెందుర్తి : జీవీఎంసీ 93వ వార్డు, వేపగుంట పరిధి ప్రహ్లాదపురం బూతు నెంబరు 186 పల్లి నారాయణపురంలో బిజెపి నాయకులు డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ బలిదాన దివస్ ను సోమవారం ఘనంగా నిర్వహించారు. మండల పార్టీ ప్రెసిడెంట్ ఎం నూక రత్నం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంఘచాలక్ ఎల్ ఎస్ ఎన్ మూర్తి, జై రాజు, పురుషోత్తం తదితర నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రట్టి జయరాజు మాట్లాడుతూ డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జీవితంలోని ముఖ్య అంశాలను వివరించారు. సమాజానికి శ్యాం ప్రసాద్ అందించిన సేవలను, త్యాగాన్ని వివరిస్తూ ఆయన్ను స్ఫూర్తిగా తీసుకొని ప్రజలకు సేవ చేయాలని బిజెపి శ్రేణులకు పిలుపునిచ్చారు.

యువతను మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వం

- జిల్లా వైసీపీ అధ్యక్షుడు కేకే రాజు
- వైసిపి జిల్లా యువజన విభాగం ఆధ్వర్యంలో చంద్రబాబు సర్కారుపై భారీ నిరసన ర్యాలీ

విశాలాంధ్ర-విశాఖ సిటీ : యువతను కూటమి ప్రభుత్వం మోసం చేస్తోందని జిల్లా వైసీపీ అధ్యక్షుడు కేకే రాజు అన్నారు. సోమవారం వైసిపి జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఊరుకూటి చందు ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ జంక్షన్ నుంచి కలెక్టర్ ఆఫీస్ వరకు " యువత పోరు" పేరుతో చంద్రబాబు సర్కారుపై భారీగా నిరసన ర్యాలీ నిర్వహించారు. జిల్లా రెవెన్యూ అధికారికి తమ వెనతులతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కేకే రాజు మాట్లాడుతూ వైసిపి జాతీయ అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు నిరుద్యోగుల పక్షాన నిలుస్తూ ఈరోజు నిర్వహించిన ర్యాలీ విజయవంతమైందన్నారు. రాష్ట్రంలో యువత తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం కొత్తగా ఉద్యోగాలు ఇవ్వక, ఇస్తానన్న నిరుద్యోగ భృతి ఇవ్వక మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఉన్న ఉద్యోగాలు తీసివేస్తూ లక్షలమంది పొట్ట కొడుతోందని కూటమి ప్రభుత్వం తీరుపై విరుచుకుపడ్డారు. షెడ్యూల్ ప్రకారం ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులకు కూటమి సర్కారు స్వస్తి పలికింది. 2024- 25 విద్యా సంవత్సరానికి ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద రూ.2,800 కోట్లు, హాస్టల్ మెయింటెనెన్స్ ఖర్చులు కింద రూ.1,100 కోట్లు కలిపి మొత్తం రూ.3,900 కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. 2025-26 విద్యా సంవత్సరానికి రూ.3,900 కోట్లు అవసరం అయితే బడ్జెట్‌లో కూటమి సర్కారు కేవలం రూ.2,600 కోట్లు మాత్రమే కేటాయింపులు జరిపిందన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగులు, చిరుద్యోగుల తొలగింపు ఆందోళన కలిగిస్తోందన్నారు. 2.66 లక్షల మంది వాలంటీర్ల కుటుంబాలు రోడ్డున పడ్డాయి. వారిని నమ్మించి మోసం చేశారని, ఇస్తానన్న రూ.10వేలు జీతం ఇవ్వక, ఉన్న ఉద్యోగాన్నీ తీసేసారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్లో పని చేసిన 18 వేల మంది రోడ్డున పడ్డారు. ఏపీ ఫైబర్ నెట్‌లో 2వేల మందిని తొలగించారు, వైద్య ఆరోగ్య శాఖలో స్పెషలిస్ట్ వైద్యుల నియామకం ఆపేశారు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లపై రాజకీయ కక్షలతో తొలగిస్తున్నారని, ఎండీయూ వాహనాలు రద్దు చేయడం వల్ల 20 వేల కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. ఆప్కాస్ రద్దు చేసేందుకు ప్రయత్నించడం దారుణం. పశుసంవర్ధక శాఖలో చిరుద్యోగులనూ తొల గించేందుకు ఉపక్రమిస్తున్నారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 4లక్షలకు పైగా ఉద్యోగాలను తొలగించారన్నారు. తొలగించిన వారందరినీ తిరిగి ఉద్యోగాల్లోకి తీసుకోవాలి, ప్రభుత్వం హామీ ఇచ్చిన 20 లక్షల ఉద్యోగాలు వెంటనే కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రతి ఏటా జనవరిలో జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని ఇచ్చిన హామీని తుంగలో తొక్కారన్నారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించే వరకు రూ.3 వేలు చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామన్న హామీ నేటికీ అమలుకు నోచుకోలేదన్నారు. రాష్ట్రంలో సుమారు 1.60 కోట్ల నిరుద్యోగ కుటుంబాలకు అన్యాయం జరుగుతోంది. ఏటా ఈ పథకానికి ఇవ్వాల్సింది రూ.57,600 కోట్లు కాగా, రెండు బడ్జెట్లలోనూ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా

కేటాయించలేదన్నారు. వెంటనే నిరుద్యోగ భృతి నిధులు చెల్లించాలని, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విశాఖ పార్లమెంట్ పరిశీలకులు కదిరి బాబురావు, నియోజకవర్గ సమన్వయకర్తలు వాసుపల్లి గణేష్ కుమార్, మళ్ళ విజయ ప్రసాద్ , తిప్పల దేవన్ రెడ్డి, మొల్లి అప్పారావు, విశాఖపట్నం జిల్లా పరిషత్ చైర్మన్ సుభద్ర, శాసన మండలి సభ్యురాలు వరుదు కళ్యాణి, మాజీ శాసనసభ్యులు తైనాల విజయ కుమార్, చింతలపూడి వెంకట రామయ్య, డిప్యూటీమేయర్ కతమురి సతీష్, యువజన విభాగం ప్రధాన కార్యదర్శి దొడ్డి కిరణ్, యువజన విభాగం అధికార ప్రతినిధి మహ్మద్ ఇమ్రాన్, యువజన విభాగం జోనల్ అధ్యక్షులు అంబటి శైలేష్, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు కొండా రెడ్డి, రాష్ట్ర అనుబంధ విభాగాల అధ్యక్షులు పెర్ల విజయ్ చంద్ర, జాన్ వెస్లీ, జిల్లా మాజీ అధ్యక్షులు కోలా గురువులు, పార్టీ నాయుకులు రొంగాలి జగన్నాధం, గోలగని శ్రీనివాస్, రవిరాజు, సతీష్ వర్మ, జిల్లా అనుబంధ అధ్యక్షులు పెడాడ రమణి కుమారి, సనపల రవీంద్ర భరత్, శివ రామకృష్ణ, బర్కత్ అలీ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నగరాభివృద్ధికి ట్రేడ్ యూనియన్ల సమన్వయం అవసరం

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం : మహా విశాఖ నగరాభివృద్ధికి ట్రేడ్ యూనియన్ల సమన్వయం అవసరం ఎంతైనా ఉందని జీవీఎంసీ నూతన కమిషనర్ కేతన్ గార్గ్ అన్నారు. భాధ్యతలు చేపట్టిన ఆయన ఛాంబర్‌లో సోమవారం జీవీఎంసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు వి.వి.వామనరావు సారధ్యంలో యూనియన్ కార్యవర్గ సభ్యులు శాలువాతో సత్కరించి పుష్ప గుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ మహా నగరపాలక సంస్థగా రూపాంతరం చెందిందంటే దీనిలో సంస్థ ఉద్యోగులు,కార్మికులు,ట్రేడ్ యూనియన్ల సహాయ సహకారాలు కీలకమని అన్నారు,సంస్థ ఉద్యోగుల సంక్షేమానికి తన వంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని, ట్రేడ్ యూనియన్ల పూర్తి సహాయ,సహకారాలు అందించాలని పిలుపునిచ్చారు. జీవీఎంసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు వి.వి.వామన మాట్లాడుతూ మహా విశాఖ సగరాభివృద్ధికి తమ యూనియన్ సంపూర్ణ మద్దతు,సహకారం అందించి చక్కని పేరు,ప్రతిష్టలు తెచ్చిపెడతామని అన్నారు. కమిషనర్‌ను కలిసిన వారిలో యూనియన్ ప్రధాన కార్యదర్శి గుమ్మడి నర్సింగరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ గొందు సీతారాం, ట్రెజరర్ డి.పోలారావు యూనియన్ నాయకులు కె.యల్లయ్య, అప్పారావు, రమణ, బి.తాతారావు, ఎల్లారావు, ప్రసన్నకుమార్, వెంకునాయుడు, వై.సత్యం, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో వేగి పరమేశ్వరరావు

విశాలాంధ్ర-పెందుర్తి : ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి అయిన సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన అమరావతిలో జరిగిన సుపరిపాలన తొలి అడుగు కార్య క్రమంలో పెందుర్తి నియోజకవర్గం నుండి రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్, పెందుర్తి గౌరీ సేవా సంఘం అధ్యక్షుడు, టిడిపి నేత వేగి పరమేశ్వరరావు పాల్గొన్నారు. అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ నాయుడు, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు, ఏపీ సీడ్స్ సంస్థ చైర్మన్ గండి బాబ్జి ఇతర అధికారులతో కలిసి సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. పెందుర్తి నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి, వచ్చే నాలుగేళ్లలో చేపట్టబోయే అభివృద్ధి పనులు గురించి సమావేశంలో చర్చించినట్లు పరమేశ్వరరావు వెల్లడించారు. రాష్ట్రస్థాయి సమావేశంలో తనకు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. చంద్రబాబు తనకు అప్పగించిన బాధ్యతను సమర్ధవంతంగా నిర్వహించి రుణం తీర్చుకుంటానని పేర్కొన్నారు.

విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి

టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు

విశాలాంధ్ర-తగరపువలస : ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు ఉన్నతమైన, విలువలతో కూడిన విద్యను అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు అన్నారు. ఐక్యరాజ్య సమితి ప్రజాస్వామ్య దినోత్సవంను పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా అందిస్తున్న సర్వేపల్లి రాధాక్రిష్ణ విద్యామిత్ర కిట్లను భీమిలి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందించారు. భీమిలి శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు ఆదేశానుసారం ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన గంటా నూకరాజు చేతులమీదుగా విద్యార్థులకు కిట్లను అందించిన అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. రాష్ట్రంలో ఉన్న కూటమి సర్కార్ విద్యా వ్యవస్థ మెరుగుకు విశేష కృషి చేస్తుందని అన్నారు. గత వైసిపీ ప్రభుత్వం కారణంగా దారితప్పిన విద్యా వ్యవస్థను మానవ వనరుల శాఖామంత్రి నారా లోకేష్ ఒక చాలెంజ్ గా తీసుకొని ఎన్నో మార్పులకు శ్రీకారం చుట్టారని అన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడంలో నారా లోకేష్ పాత్ర అమోఘమని అన్నారు. అందులో భాగంగానే 16 వేలకు పైగా ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేస్తున్నారని అన్నారు. అంతే కాకుండా ప్రతీ ఏడాది డిఎస్సీ ద్వారా టీచర్ పోస్టులను భర్తీ చేస్తామని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ హామీ ఇచ్చారని అన్నారు. నాణ్యమైన

విద్యా కిట్లతో పాటు మధ్యాహ్నం భోజనం పథకంలో విద్యార్థులకు సన్నబియ్యం ద్వారా ఆహారాన్ని అందించడం చాలా గొప్ప విషయమని అన్నారు. ప్రతీ ఒక్క విద్యార్ధి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని ఉజ్వల భవిష్యత్తుకు శ్రీకారం చుట్టాలని, తల్లిదండ్రులకు, విద్యను నేర్పే ఉపాధ్యాయులకు, ఉన్న ఊరికి మంచి పేరు తీసుకు రావాలని గంటా నూకరాజు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పి.రమణ, ఇంచార్జ్ ఉపాధ్యాయులు జి. ప్రభాకర్, విద్యా కమిటీ చైర్మన్ శారద మరియు తెలుగుదేశం పార్టీ నాయకులు కాసరపు నాగరాజు, సంకురుభుక్త జోగారావు, జలగడుగుల మురళి, కుప్పిల గురుమూర్తి, రాజగిరి రమణ, నెక్కెళ్ళ వెంకటరావు, వియ్యపు పోతురాజు, కృష్ణారావు మాస్టర్, వాసుపల్లి వంశీ మరియు పాఠశాల ఉపాధ్యాయులు రాధా కుమారి, హైమావతితో పాటు ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీ జగన్నాథ స్వామి రథయాత్రకు నగర మేయర్‌కు ఆహ్వానం

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం : శ్రీ జగన్నాథ స్వామి వారి కళ్యాణం మరియు రథయాత్రకు నగర మేయర్ పీలా శ్రీనివాసరావుకు శ్రీ జగన్నాథ స్వామి దేవాదాయ ధర్మాదాయ శాఖ కార్య నిర్వహణ అధికారి టి. రాజగోపాల్ రెడ్డి ఆహ్వాన పత్రికను జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని మేయర్ చాంబర్లో సోమవారం అందించారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ విశాఖపట్నంలో జూన్ 27న నిర్వహించే శ్రీ జగన్నాథ స్వామి రథయాత్ర పాల్గొనేందుకు ఆహ్వానం అందిందని మేయర్ తెలిపారు. విశాఖ సగరంలో ప్రతిష్టాత్మకంగా, ఘనంగా నిర్వహించనున్న శ్రీ జగన్నాథ స్వామి రథయాత్ర ఎంతో భక్తి శ్రద్ధలతో జూన్ 27 నుండి జూలై 7 వరకు జరుగునని, ఈ కార్యక్రమానికి వేలాదిగా భక్తులు స్వామి వారి రథయాత్రలో పాల్గొంటారని ఎవరికీ ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు ఆధ్యాత్మిక శోభతో నిర్వహించాలని దేవాదాయ ధర్మాదాయ శాఖ కార్యనిర్వాహణాధికారికి మేయర్ సూచించారు.

గొట్టిపల్లి సర్వేనెంబర్ 102-3లో స్పందనలో ఫిర్యాదు

విశాలాంధ్ర-ఆనందపురం : గొట్టిపల్లి గ్రామంలో రెవెన్యూ సర్వే నెంబర్ 102-3లోని భూమిపై గత కొన్ని సంవత్సరాలుగా వివాదం కొనసాగుతుండగా, అసలు భూ యజమానులు తమ హక్కును రక్షించుకునేందుకు పోరాడుతున్నారు. దీనిపై సోమవారం జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేశారు. చందక గ్రామానికి చెందిన దొంతల వీరప్ప, అప్పలనాయుడు, తమ్మన్న, సిరిపురపు రామారావు, సూరీడు తదితరులు సర్వే నెంబరు 102/3లో భూమిని దశాబ్దాలుగా సాగుచేస్తూ పన్నులు చెల్లిస్తూ వస్తున్నారని తెలిపారు. 1969లో తీసుకున్న రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ల ఆధారంగా తమకు భూమిపై పూర్తి హక్కు ఉన్నదని వారు పేర్కొన్నారు. అయితే 2016లో కొంతమంది ఇతరులు తప్పుడు డాక్యుమెంట్లు చూపిస్తూ భూమిపై హక్కులు కలిగి ఉన్నట్లు కోర్టు నుండి తాత్కాలికంగా స్టే (ఇంజంక్షన్) పొందినట్లు పేర్కొన్నారు. అనంతరం అసలైన యజమానులు కోర్టులో కేసులు వేయగా, ప్రస్తుతం విచారణలో ఉన్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో రెవెన్యూ అధికారులు ఇటీవల ఎటువంటి నోటీసులు లేకుండా, వారి డాక్యుమెంట్లు పరిశీలించకుండానే కొన్ని భాగాలకు విడిగా ఎల్పియం లు (ల్యాండ్ ప్యార్సెల్ మ్యాప్) మంజూరు చేయడం బాధాకరమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఇచ్చిన విడిపడిన ఎల్ పి ఎం లను రద్దు చేయాలని, మొత్తం 9.81 సెంట్ల భూమిని కోర్టు తేలే వరకు డిస్ప్యూట్ జోన్‌గా ఉంచాలని జిల్లా కలెక్టర్కు వినతి పత్రంలో తెలిపారు.

శ్యాం ప్రసాద్ ముఖర్జీ ఆశయ సాధనకు పనిచేయాలి

కార్పొరేటర్ ముమ్మనదేముడు

విశాలాంధ్ర-పెందుర్తి : భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ ఆశయ సాధనకు బిజెపి శ్రేణులు కంకణ బద్ధులై పని చేయాలని బిజెపి పెందుర్తి నాయకుడు జీవీఎంసీ 95 వార్డు కార్పొరేటర్ ముమ్మన దేవుడు పిలుపునిచ్చారు. శ్యాం ప్రసాద్ ముఖర్జీ 72వ వర్ధంతి సందర్భంగా సోమవారం 97వ వార్డు చినముషిడివాడలో బిజెపి 95,97వ వార్డుల అధ్యక్షులు చిక్కాల సతీష్ ఆధ్వర్యంలో దివస్ కార్యక్రమం నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ముమ్మన దేముడు పాల్గొని శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ జీవిత విశేషాలు దేశానికి ఆయన చేసిన సేవలు ముఖ్యంగా జమ్ము,కాశ్మీర్ విషయంలో ఆయన సాగించిన పోరాటాన్ని వివరించారు. ఒకే దేశం, ఒకే నిబంధన, ఒకే ప్రధాని అనే, శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ మాటలు గుర్తు చేసుకున్నారు. సమావేశానికి విచ్చేసిన కార్యకర్తలు అభిమానులు శ్యాంప్రసాద్ చిత్రపటానికి పూలమాలు వేసి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా బలిదాన్ దినాన్ని గుర్తుచేసుకొని, ప్రతి ఒక్కరూ దేశానికి సేవ చేయాలని పిలుపునిచ్చారు, శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ ఆశయ,ఆలోచన విధానాలు భారతదేశ ప్రధాని నరేంద్ర మోదీ అనుసరిస్తున్నా రని అన్నారు. కార్యక్రమంలో బిజెపి అనకాపల్లి జిల్లా కార్యదర్శి పురిజాల బాలసుబ్రమణ్యం, జిల్లా ఓబీసీ అధ్యక్షులు కంచిపాటి సన్యాసిరావు, బీజేపీ నాయకులు కాళ్ళ జగన్ మోహన్,ఎర్ర అచ్చంనాయుడు, కంచిబోయిన వెంకట సంతోష్, సుంకరి విజయ శేఖర్, కొత్తపల్లి అప్పలరాజు, పిడివి. ప్రసాద్, జగ్గునాయుడు, గోవిందరావు, నాయుడు, ప్రసాద్,కెవిఆర్.లక్ష్మి, భవాని, మణి, పార్వతి, మాధవి,భారతి,బిజెపి శక్తి కేంద్ర ప్రముఖులు,బూత్ ఇంచార్జ్‌లు, బిజెపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

వైభోపేతంగా నిత్య కళ్యాణం

విశాలాంధ్ర-సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం ప్రముఖ పుణ్యక్షేత్రముగా విరాజిల్లుతున్న సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి వారి నిత్య కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. ఆర్జిత సేవల్లో భాగంగా అర్చక స్వాములు ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో మండపంలో అధిష్టింప జేశారు. నిత్య కల్యాణంలో పాల్గొన్న భక్తుల, గోత్రనామాలతో సంకల్పం చెప్పి పాంచరాత్ర అగమశాస్త్రం విధానంలో విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలతో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కంకణధారణ, నూతన యజ్ఞోపవీత సమర్పణ, జీలకర్ర, బెల్లం, మాంగళ్య ధారణ, తలంబ్రాల ప్రక్రియలను కమనీయంగా జరిపించారు. మంత్రపుష్పం, మంగళాశాసనాల తర్వాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, స్వామివారి ప్రసాదాలను అందజేశారు. అనంతరముస్వామివారి అంతరాలయ దర్శనం కల్పించారు.

ఆధునిక హిందుత్వాన్ని ప్రగాఢంగా విశ్వసించిన శ్యాం ప్రసాద్ ముఖర్జీ

బిజెపి కన్వీనర్ గొర్లె రామునాయుడు

విశాలాంధ్ర-పెందుర్తి : దేశంలో ప్రముఖ జాతీయవాది అయిన శ్యాం ప్రసాద్ ముఖర్జీ ఆధునిక హిందుత్వాన్ని ప్రగాఢంగా విశ్వసించే వారిని భారతీయ జనతా పార్టీ పెందుర్తి నియోజకవర్గం కన్వీనర్ గొర్లె రామునాయుడు అన్నారు. సోమవారం జనసంఘ్ వ్యవస్థాపక అధ్యక్షులు పార్టీ సిద్ధాంత కర్త శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి (బలిదాన దివస్) ను పురస్కరించుకొని పెందుర్తిలో రామునాయుడు ఆధ్వర్యంలో ఆయనకు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామునాయుడు మాట్లాడుతూ 1951లో భారతీయ జనసంఘ్ పార్టీ స్థాపించిన ముఖర్జీ ఆధునిక హిందుత్వ, హిందూ జాతీయవాదాన్ని ప్రగాఢంగా విశ్వసించారని, హిందూ మహాసభ, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ సభ్యుడిగీ జనసంఘ్‌ను స్థాపించి దేశంలో తొలి హిందూవాద రాజకీయ పార్టీని స్థాపించిన నేతగా స్థానం పొందారన్నారు. కలకత్తా విశ్వవిద్యాలయం కులపతిగా పనిచేసిన అశుతోష్ ముఖర్జీ కుమారుడైన శ్యాంప్రసాద్ ముఖర్జీ కోల్‌కత లోనే ఉన్నత విద్యాభ్యాసం అభ్యసించి ప్రారంభంలో కాంగ్రెసు వాదిగానే రాజకీయ జీవితం ఆరంభించారని, స్వాతంత్ర్యానికి పూర్వం జవహర్ లాల్ నెహ్రూ నేతృత్వంలోని మధ్యంతర ప్రభుత్వంలో పరిశ్రమల మంత్రిగా పనిచేశారని గుర్తు చేశారు. 1949లో ఢిల్లీ ఒప్పందానికి వ్యతిరేకంగా కాంగ్రెసు పార్టీ నుంచి తప్పుకొని అక్టోబరు 21, 1951 న జనసంఘ్ పార్టీని స్థాపించి, ఆ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడిగా మే 23, 1953 న మరణించేవరకు కొనసాగారని రామునాయుడు వెల్లడించారు.

మనుషులు చనిపోతే జీవీఎంసీ లేదా ప్రభుత్వం బాధ్యత వహిస్తుందా

రామకృష్ణ థియేటర్ వెంటనే కూల్చి వేయాలి



విశాలాంధ్ర-విశాఖపట్నం: బౌరాడా రోడ్‌లోని రామకృష్ణ పిక్చర్ ప్యాలెస్‌పై హైకోర్టు ఉత్తర్వులను అమలుచేయడంలో జి.వి.ఎం.సి నిర్లక్ష్యం పట్ల మేయర్ పీలా శ్రీనివాస్‌ని కలిసి వినతిపత్రం సమర్పించినట్లు తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్, వేగి రాధాకృష్ణ తెలిపారు. రామకృష్ణ పిక్చర్ ప్యాలెస్ వారసుడు వేగి రాధాకృష్ణ తో కలిసి హైకోర్టు తీర్పును అమలు చేయాలని కోరారు. జి.వి.ఎం.సి మున్సిపల్ కమిషనర్ కేతన్ గార్గ్ అందుబాటులో లేకపోవడం తో మేయర్ ను కలిసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా బి.వి.రామ్ మాట్లాడుతూ హైకోర్టుకి తీర్పు వచ్చి సంవత్సరంన్నర కాలం గడుస్తున్నప్పటికీ ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. శిధిలావస్థలో ఉన్న రామకృష్ణ థియేటర్ కూల్చివేసి న్యాయంగా వేగి రాధాకృష్ణ కి రావాల్సిన ప్రాపర్టీని అప్ప చెప్పాలని డిమాండ్ చేశారు. అధికారుల పై కూడా చర్యలు తీసుకోవాలని హైకోర్టు తీర్పు చెప్పింది అన్నారు. ప్రస్తుతం అది ఆక్రమణలో ఉందన్నారు. వేగి రాధాకృష్ణ మాట్లాడుతూ టౌన్ ప్లానింగ్ అధికారులు లంచాలు తీసుకుని అమలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వీరికి కూడా నోటీసులు పంపించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పి.గణపతి తదితరులు పాల్గొన్నారు.